



# రాబందువులు

కందుకూరి వెంకటమహాలక్ష్మి

కొందరి మూఢనమ్మకాలనంది, అనాలోచితపు పనుల కనండి, మూఢవిశ్వాసాల కనండి -వేటికయితేనేమి మరొకరు పతనమవడమే కాకుండా, ఆ నమ్మకాల పర్యవసానం మరొకరి మీదపడి వారి జీవితంతో పాటు, వారి కుటుంబంలోని వారి భవిష్యత్ కూడా నాశన మవుతుంది.

నానిని చూసాకా నాకీ ఉపోద్ఘాతం వ్రాయాలనిపించింది. వాడూ నేనూ చిన్నప్పటి నుంచి కలిసి తిరిగాం. కలిసి చదువుకున్నాం. ఆఖరికి ఉద్యోగాలు కూడా ఒకే వూరిలో రావడంతో రోజూ ఏదో టైములో కలుస్తూ మా మధ్యతరగతి కష్టసుఖాలని చెప్పుకునేవాళ్ళం.

అసలు పేరు దేవుళ్ళ పేరంతా కలిపి చాంతాడంత. అయితే కొడుకు, కొడుకని కలవరించి పోయి, పుత్రులు లేని వారి జన్మ నరకప్రాయమన్న నమ్మకంతో తపించిపోయి, పూజలూ, పునస్కారాలు చెయ్యగా అయిదో వాడుగా పుట్టిన వాడిని 'నాని' అని ముద్దుగా పిల్చుకునే వారు.

నాని బి. కాం ఫైనల్‌లో వుండగానే కారు ఏక్సిడెంట్‌లో తండ్రి మరణించటంతో చిన్న వయసులోనే అతని నెత్తిన సంసార బాధ్యత పడింది. కొంత పొలం అమ్మి నాని అక్కలిద్దరి పెళ్ళిళ్ళూ తండ్రే కానిచ్చాడు. 'గుడ్డిలో మెల్ల' అన్నట్లు తండ్రి ఆఫీసులోనే నాని బి. కాం పూర్తవగానే ఉద్యోగం యిచ్చారు ప్రభుత్వం రూల్సు ప్రకారం. అప్పటికే ఆఖరాద పిల్లలిద్దరూ పెళ్ళికెదిగి పోయారన్న తల్లి గోల భరించలేక నాని మిగిలిన పొలం, ఇల్లు అమ్మి అక్కలిద్దరి పెళ్ళిళ్ళూ తాహతుకి మించి చేశాడు.

ఆడపిల్లల బాధ్యతలు తీరిపోయాయి. ఇక కొడుకు గడించే డబ్బుతో గుట్టుగా కొన్నాళ్ళు ఆ తల్లి సంసారాన్ని లాక్కొచ్చి వుంటే వారి జీవితాలు కొంతకాలమన్నా హాయిగా సాగిపోయేవి. పిల్లల పెళ్ళయిన మర్నాటి నుంచే నానిని పెళ్ళి చేసుకోమని పోరటమే కాకుండా, సంబంధాలు కూడా తీసుకొచ్చేది.

'అమ్మా! కొన్నాళ్ళు నన్ను నిలదొక్కుకోనీ అమ్మా! కొంత డబ్బు నిలవ్వేసుకొని చేసుకుంటా"నన్న దానికి నే నీ యింట్లో చాకిరీ చెయ్యలేనురా! వయసొస్తోందా! అయినా యింట్లో దీపం పెట్టే పునిస్త్రీ పిల్లలేదు!" అంటూ మొదలెట్టేది. ఇంకా గట్టిగా ఏమన్నా అంటే తన పెద్దరికానికి భంగం వచ్చినట్లు తన్ని నిర్లక్ష్యం చేసాడంటూ బాధపడటంతోపాటు "మీ నాన్న పోబట్టి, నీ తిండి తి బట్టి, నా బ్రతుకిలా వుందంటూ తల్లి పెట్టే కన్నీళ్ళు చూడలేక నాని పెళ్ళికి తలొగ్గి యింటికి భార్యని తీసుకొచ్చాడు.

ముందు వద్దన్నప్పటికి భార్య రత్న వచ్చాకే వాడిలోనూ ఓ విధమైన ఉత్సాహం వచ్చి "మంచి పనే చేసా"ననుకునేవాడు.

కాని అసలు కష్టాలు ప్రారంభమయింది ఈ స్టేజిలోనే! ప్రభుత్వోద్యోగి నానికొచ్చే జీతంలోనే ఆ యిల్లు గడపాలి. తప్పదు. ఆ నూతన దంపతులకి అచ్చట్లు, ముచ్చట్లు తీర్చుకోవాలన్న కోరిక లొచ్చేవి. వచ్చే జీతంలో రెండింటినీ అందుకోలేని నాని ముఖ్యమైనవి చూసుకుంటు తమ తమ సరదాలని చంపుకొనేవాడు. రత్న మనసు అప్పుడప్పుడు బాధపడినప్పటికీ భర్త అనురాగమే అన్ని ముచ్చట్లు" అని సరిపెట్టుకునేది. దీనికి ముఖ్యంగా యింట్లో పెద్దవారి అండ, సహకారం, తృప్తి, అవగాహన తోడైతే వారి సంసారం స్వర్గతుల్యమయ్యేది.

రామలక్ష్మి గారికి కోడలొచ్చిన కొత్తలో ఆనందంగానే వుండేది. కాని ఆ ఆనందాన్నలా అట్టే కాలం నిల్పుకోలేక పోయింది. ఇంట్లో అన్నింటా తనతో పాటు సగం వాటా పంచుకుంటున్న పరాయి స్త్రీని చూసి సహించలేకపోయేది. తన వస్తువు నెవరో లాక్కుపోతున్నారన్న భావం ఆమెలో ఏర్పడింది. అంతేకాక ఆ యింట్లో అంతా పరాయివాళ్ళలాగా, ఆ యింట్లో తననెవ్వరూ గౌరవించనట్లు, కించపరుస్తున్నట్లు భావించ సాగింది. కొన్నాళ్ళ ఆ యింటి నుంచి వెళ్ళిపోతేగాని తన విలువ తెలిసిరాదన్న ఉద్దేశ్యంతో "వో వెయ్యి రూపాయిలివ్వరా! ఆడపిల్లల్ని చూసి రావాల నుందంటూ కొడుకుని అడిగింది.



అన్నంలో అన్నం, ఖర్చులో ఖర్చు పెట్టడానికి లోటులేని సంసారం కాని అడిగిందే తడవుగా వెయ్యి రూపాయలు తెచ్చివ్వగల స్తోమత తనకి లేదని తెలిసి కూడా తల్లి అలా అడగడం నానికి ఆశ్చర్యాన్ని కలిగించినప్పటికీ, అదే మాట విడమర్చి చెప్తే తల్లి అనే మాటలు తెలిసిన నాని నా దగ్గరకి పరిగెత్తుకు వచ్చి ఈ కష్టాలన్నీ చెప్పుకున్నాడు. ఎలాగో ఓ వెయ్యి రూపాయలు అప్పు పుట్టించివాడికా కష్టం గట్టెక్కించాను.

కానీ అది అంతతో ఆగక వెళ్ళిన రెండు నెలలకే మళ్ళీ ఓ పదిహేనొందలు పంపమంటూ వ్రాసి, దానికి కారణాలు వివరించింది. పెద్ద పిల్ల పెళ్ళయిన యిన్నేళ్ళకి నెల తప్పిందని, డాక్టర్లు దానికి బాగా రెస్టు కావాలన్నారని, మంచి మందులిప్పించమన్నారనీ, అత్తవారింట ఆడ పిల్లకి విశ్రాంతి ఉండదు గనక త్వరలో దాన్ని తీసుకొస్తున్నాననీ, వారం రోజులలో అయిదవనెల వస్తోంది, వారికి, మనకి తొలిసారి వేడుక గనక కాస్త ఘనంగా సూడెదలిచ్చి తీసుకురావాలి కదా? నువ్వు వెంటనే డబ్బు పంపు. నేను రెండు నెలలుగా నీ దగ్గర లేను కదా? నాకయ్యే డబ్బు మిగిలే వుంటుంది. ఆలస్యం చెయ్యకు -

ఇది ఆ ఉత్తరంలోని సారాంశం. మళ్ళీ అదుచ్చుకుని పరుగెత్తుకొచ్చిన వాడికి మరొకని చేత ఆ డబ్బు అప్పు యిప్పించి పంపేను.

ఇలా ముందు ముందు జరిగే ఈ సంఘటనల గురించి వివరంగా రాయనక్కరలేదు. ఒకరి తర్వాత ఒకరికి సూడెదలంటూఆ తరువాత పురుళ్ళకంటూ, బారసాలకంటూ, వీటన్నింటికి వచ్చిన వారికి బట్టలంటూ, పుట్టిన పిల్లలకి నగలంటూ ఆ తల్లి నానిలోని రక్తాన్ని పిల్చేసేదే గానీ కొడుకొచ్చే జీతంలో ఈ ఖర్చులన్నీ ఎలా తట్టుకుంటాడనీ ఆలోచించేదికాదు.

"అమ్మా! కాసు బంగారం కొనాలంటే రెండు వేలన్నా కావాలమ్మా!" అని తల్లికి చెప్పబోతే "నాయనా! నా పుట్టింటివారు పిల్లకి రెండేసి, మూడేసి కాసులు పెట్టార్రా! కనీసం ఆ మాత్రమన్నా మనం పెట్టక పోతే ఏం మర్యాదగా వుంటుందిరా?!" అనేదేగానీ తన కాలం ధరల్తో యిప్పటి ధరలు పోల్చి చూసుకొనేదికాదు.

ఈ ఖర్చులు తట్టుకోలేక నాని కాబూలీ అప్పులు కూడా చేస్తున్నట్లు తెలిసి అడిగితే అవునురా! యిప్పటికే చాలా చోట్ల అప్పులు యిప్పించావు. ఎంతనింకా నిన్నడగలను? అన్నాడు జాలిగా ముఖంపెట్టి.

నాని ఈ విధంగా హింసించబడుతుంటే ఆ యింటి కోడలు రత్న ఓ ముద్దూ ముచ్చటా తీరక, ఆఖరికి సరియైన బట్ట కూడా వంటిని లేక బాధపడేది. భర్తకొచ్చే జీతంలో మూడొంతులు వడ్డీలకి పోతుంటే, మిగిలినదాంతో సంసారం లొక్కురాలేక సతమతమయ్యేధి. అందుకు కనీసం యింట్లో వారి

సానుభూతన్నా లభిస్తుందేమోనని ఆశించేది. రత్నానికదీ కొరతయ్యింది.

రక్తమాంసాల్ని పీల్చి, పిప్పి చేస్తున్న ఈ రాబంధువుల మధ్య, పచ్చులకి పీక్కు తినే కాబూలీ అప్పులాళ్ళ మధ్య సతమతమయిపోతున్న ఆ దంపతులు టీవప్పవాల్లా తయారయ్యారు. రాను రాను పరిస్థితులకి విసిగిపోయిన నాని తన కోపాన్ని, విసుగుని ఎవరి మీద చూపించాలో అర్థమవక రత్న ఏం మాట్లాడినా విసుక్కోవడం, చిరాకుపడటం ప్రారంభించాడు. తల్లి పెట్టించే ఖర్చుల్ని అప్పుచేసన్నా చెయ్యక తప్పని నాని, రత్న యింటికోసం చెప్పే సరుకుల్ని కూడా తేలేక ఆమెని కసరడమే కాకుండా తిట్టి, కొట్టి తన కోపాన్ని చల్లార్చుకునేవాడు. ఆఖరికి భర్త ఆదరణ కూడాలోటయిన రత్న బెంగతో చిక్కి శల్యమవసాగింది. కోపంతో అనాలోచితంగా భార్యని తిట్టి, కొట్టినప్పటికి, నా దగ్గరకొచ్చి బాధపడి, రత్న ఆరోగ్యం గురించి విచారించేవాడు.

కృశించిపోతున్న రత్నని ఓసారి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళి చూపించాము. డాక్టర్ అన్ని పరీక్షలూ చేసి ఆమెకి క్షయ వచ్చిందని, దానికి ఆరునెలలపాటు ఖరీదయిన మందులు వాడి, పూర్తిగ రెస్టు యివ్వాలని, నెల నెలా అన్ని టెస్టులూ చేయిస్తూ వుండటమే కాకుండా మంచి టానిక్కులు, బలమైన తిండి కూడా ఏడాదిపాటు యివ్వాలని చెప్పడంతో, నానితో పాటు నా కాళ్ళూ, చేతులూ కూడా

# రాబందు(వు)లు

చల్లబడ్డాయి. 'ధనవంతులకి రావలసిన రోగాలివి. రత్నంలాంటి మనసుగల రత్నకి కాదు" అనుకున్నాను.

ఇంటిదగ్గరి వార్త విన్న తల్లి నానిని, నన్ను పిల్చి "ఈ రోగం అంటురోగం! దాన్నింట్లో ఎలా పెట్టుకుంటాం? నా యింటికి నా పిల్లలూ, మనవలూ వస్తూ వుంటారాయె! నాకి చాకిరి చేసే ఓపికలేదు! ఏ ధర్మాసుపత్రిలోనో పెట్టడమో లేదా దాని పుట్టింటికి పంపెయ్యడమో చేస్తే మంచిది." అంటూ తన నిర్ణయాన్ని నిక్కచ్చిగా చెప్పేసింది.

వయసులో పెద్దావిడగా, నానికి తల్లిగా నాకు యిన్నాళ్ళూ ఆమె మీదున్న గౌరవం కాస్తా ఆ ఒక్క మాటతో పోయింది. ఆ యింట కాలెట్టింది మొదలు నాది అనకుండా వచ్చిన వారందరికీ పెట్టడమే కాకుండా, తనవంటి నున్న నగల్ని అర్పించిన రత్నాన్ని, అత్త, ఆడబిడ్డలం అంటూ రౌతుల్లా సవారి చేస్తూ కూర్చున్న వారందరికీ విశ్రాంతి లేకుండా బందచాకిరి చేసిన ఈ రత్నాన్ని గురించే నా యిలా చెప్తుంటే ఆ యింటికి దీపమై వెలుగునిస్తూ తాను కొవ్వొత్తిలా కరిగిపోయింది. హరించి పోయింది. కరిగిపోయిన కొవ్వుని గోకి పారేసినట్లే 'యిప్పుడు రత్నాని ఆ యింట నుంచి పంపెయ్యమని ఎంతో తేలిగ్గా చెప్తోంది యిల్లాలు. అత్త అంటే యిలాగే వుండాలా?-అత్త కోడలు అనుబంధమింతేనా?? అత్త కోడల్నికన్నా ఓ తరం ముందు వ్యక్తి. మరి కూతుర్ని, కోడల్ని ఒకే కంటితో ఎందుకు చూడలేరు? ఆడపిల్ల పరాయింటికి వెళ్ళిపోతుందన్న- మమకారం, వాళ్ళకి పుట్టింటి అచ్చటా, ముచ్చటా తీర్చాలన్న ఆశ తల్లికుండడం సహజం. కాని ఒకరి కోసం మరొకర్ని పతనం చెయ్యడం సమంజసమేనా! అని ఒక్కసారి ఆలోచించలేరూ? నా కోడలూ ఓ యింటి ఆడపిల్లే అనిగానీ, నా పిల్లలాంటిదే అనిగానీ యోచించరేం? పనికిరాని వస్తువుని బైటపారేసినట్లే, రోగమొచ్చి, చాకిరీ చెయ్యలేని కోడల్ని పంపెయ్య మనడం భావ్యమేనా? రేపు మీకే ఈ రోగమొస్తే అని అడిగితే?? కాని చిన్నవాళ్ళు అలా పెద్దాళ్ళని అడక్కోడదని సమాజం చెప్పింది. అప్పటికే "కన్న తల్లంటే గౌరవం లేదురా! నీకోసం తపస్సుచేసి కని, ఎంత కష్టపడి పెంచాంరా!పెళ్ళా మొచ్చాకా తల్లి గుర్తుంటుందా నాయనా!ఈ కాలం వాళ్ళింతే" అంటూ సొకాలు తియ్యడం పరిపాటయిన ఆమెతో ఏం చెప్పినా ప్రయోజనంలేదని తెలిసి వూరుకున్నారు.

రోగంతో పుట్టింటికి చేరిన రత్నానికి వారూ సామాన్యులే కావడంతో తగిన మందులు, తిండీ పడక ఆరోగ్యం దెబ్బతినసాగింది. అప్పులకి వడ్డీలుకడుతూ, యిల్లు నడపలేక సతమతయ్యే నాని భార్యకి నాయాపైసన్నా పంపలేకపోగా, కనీసం కళ్ళతో చూడటానికి కూడా వెళ్ళలేక పోయేవాడు









అప్పుడప్పుడు నా దగ్గరకొచ్చి రత్న గురించి బాధపడుతూ నా నుంచే దానికారోగం వచ్చిందిరా! నేనుకూడా దాన్ని చాలా హింసించానురా! దానికి పుట్టింటి వారిచ్చిన పది రూపాయలుకూడా ఎన్నడూ దాచుకునెరగదురా! నా యింట అడుగెట్టింది మొదలు కష్టాల్నే రుచి చూసిందిరా! దాన్ని పెట్టిన ఉసురు నాకే కొడుతుందిరా!" అంటూ విలపించే వాడు. చేతులు కాలేక ఆకులు పట్టుకున్నట్లు ఎందుకురా ఆ ఏడుపు?" అని మందలించేవాడిని.

వీళ్లిలా వున్నప్పటికీ నేనా యింటికి వెళ్తే నవ్వుతూ ఎదురొచ్చి పలకరించే నాని తల్లి ముఖంలోని ఆనందం నన్నాశ్చర్య పర్చేది. ఎప్పుడూ కూతుళ్ళ, మనమల ముచ్చట్లు చెప్తూ, వారిని ఎంతెంత వున్నతుల్ని చేసింది చెప్తూ మురిసిపోయే ఆ తల్లిని చూస్తే ఒక్కోసారి జుగుప్స కలిగేది. ఆ దృష్టితోటే చూసి కొడుకు సంసారం గురించెందుకు బాధపడదు? కోడలి రోగం గురించెందుకు ఆలోచించదు? కొడుకిలా అప్పుల్లో మునిగి కూతుళ్ళ ముద్దు, ముచ్చట్లు తీరుస్తుంటే బెంగలేదు సరికదా– ఆనందంతో అవునురా! తండ్రిలేని ఆడపిల్లలికి అన్నదమ్ములు చెయ్యకపోతే ఎవరు చేస్తారు? అప్పో, సొప్పో చేసి మనమేకదా చెయ్యాలి అని నీతులు బోధిస్తూ ఓ పక్క కొడుకు సంసారాన్ని నాశనంచేసే తల్లి ఓ తల్లేనా? అనిపించేది. లోకంలో "తల్లి" అనే పదానికి విలువ కట్టలేమంటారు. కానీ యిటువంటి తల్లులు కూడా వుంటారన్నది నాని తల్లిని చూసాకానే నాకు తెల్సింది.

ఆఫీసులో దొరికినన్నిల్లోనూ తీసుకొన్న నానికి జీతం పూర్తిగా రావటం లేదు. వచ్చింది అప్పులాళ్ళ వడ్డీలకి చాలటం లేదు. దీనికి తోడు అక్కలు తమకి జరుగుతున్న లోటుపాట్లని అత్తవారెలా సాధిస్తున్నారో ఉత్తరాల ద్వారా దెప్పిపొయ్యడం. భార్య అనారోగ్యం రోజురోజుకి ముదురుతున్నట్లు వచ్చే ఉత్తరాలు – వీటన్నిటితో విసిగిపోయిన నాని మానసికంగా, శరీరకంగా కృంగిపోతూ, వీటన్నిటికి తన అసమర్థతే కారణమనుకొంటూ నా దగ్గర విరక్తిగా మాట్లాడే నానిని చూస్తే ఒక్కోసారి భయమేసేది.

అనుకున్నట్లే ఈ జీవిత పోరాటంలో ఓడిపోయిన నాని ఆఫీసులో ఫైలంతస్తు మీంచి దూకి ఆత్మహత్య చేసుకోబోయాడని, ఆసుపత్రిలో వున్నాడని కబురందిన నేను క్షణాల మీద పరిగెత్తుకెళ్ళాను.

రెండు రోజులకి స్పృహ వచ్చిన నాని నన్ను చూసి గోల పెట్టాడు. "ఒరేయి రాజూ !చావు కూడా ఒక వరమేరా! దేముడు అది అందరికి ప్రసాదించడురా! నామీద కసికట్టిన ఈ కాలం నా ఓ చేతిని మింగేసిందిరా! అవిటిగా జీవితాంతం బ్రతకమని విధి నన్ను శిక్షించిందిరా!" అంటూ దుఃఖిస్తున్న నానిని ఎలా వూరడించాలో తెలీక పక్కకి తిరిగి కళ్ళుతుడుచుకున్నాను.

ఈ కబురు తెలిసిన రత్న శవాకారంలో వచ్చి లేని ఓపిక తెచ్చుకుని భర్తకి సేవలు చెయ్యసాగింది. 'భర్తకి రోగమొస్తే చెయ్యవలసింది ఒక్క భార్యే కదా? ఈ నాడు కనీసం ఓ అక్కగారయినా ఆపేక్షగా వచ్చి తమ్ముడిని పలకరించలేదు. పైగా దానికి పెద్దలు చెప్పిన నీతుల్ని వల్లిస్తూ "పరాయి యింటి 'ఆడపిల్లొచ్చి ఏం చెయ్యగలదు నాయనా! అస్వతంత్రులు" అన్న ఒక్క సానుభూతితో తప్పించుకుందా తల్లి. నిజమే! ఈ కుళ్ళు సమాజం ఆడపిల్లలకో నీతి, కొడళ్ళకో నీతి తయారు చేసింది. అందుకు అవే మాటలు ఆమె నోటంట వినడంలో ఆశ్చర్యం లేదనుకున్నాను.

ఇహనో, యిప్పుడో అనున్న క్షయ రోగి యింటికి రావడం యిష్టంలేని అత్తగారు "అమ్మా రత యింటి దగ్గర నేను చూసుకుంటాను ఆసుపత్రిలో వుండి వాడిని చూస్కో తల్లి!" అంటూ తియ్యటి కబుర్లతో కోడల్ని యింటికి రానీకుండా జాగ్రత్తపడింది.

రోజూ సాయంకాలాలు వెళ్ళి నానిని, అతనికి రాత్రి, పగలు తన ఆరోగ్యాన్ని మరిచి సేవలు చేస్తున్న రత్నని పలకరించి రావడం నా దిన చర్యలో ఒకటయింది.

ఆ రోజు వెళ్ళిన నాకు రక్తం కక్కుకున్న రత్నని వేరే ఆసుపత్రిలో చేర్చారన్న వార్తతో పాటు, నానికి తీసేసిన చెయ్యి దగ్గర సెప్టిక్ అయిందన్న విషయం డాక్టర్ చెప్పగానే పెద్ద డాక్టర్లని కలిసి వాకబు చెయ్యగా రెండు కేసులూ లాభం లేనివని చెప్పేసారు.

నానికి యిరవై నాలుగు గంటల లోపల, రత్నకి కొన్ని రోజుల లోపల ఈ కుళ్ళు సమాజం నుంచి బ్రతికుండగా పీక్కుతినే ఈ రాబంధువుల నుంచి విముక్తి లభిస్తోందన్న మాట." అనుకున్నాను బాధగా. కాలానికి ఎదురీదే ఈ రకం వ్యక్తులు ఏ నాడో ఓ నాడు అలిసిపోయి, ఓడిపోయి తమ జీవితాలని యిలాగే ఒకరికి అంకితం చేస్తారు. అటువంటి వారి జీవితాలిలా ఒకరి కోసం బలి కావలిసిందే!!

మొదట్లోనే ఆడా, మగకి తేడా లేదనుకునుంటే నాని ఈ లోకంలో కొచ్చేవాడూ కాదు – ఈ బాధలు పడేవాడూ కాదు. అందుకే మూఢనమ్మకాలతో కొందరు చేసే పనులకి మరొకరు హింసింపబడతారన్నాను. కనీసం తల్లన్నా నాని బాధలు తెలుసుకుని మెలిగి వుంటే, నాని జీవితం కూడా హాయిగా పిల్లా, పాపతో కలకల్లాడేదేమో!! పోనీ సానుభూతన్నా లభిస్తే కొంతలో కొంతన్నా మెరుగ్గా వుండేదేమో!!! ఏది ఏమైనా వారి బ్రతుకులు నాని, రత్నాల బ్రతుకుల్లాగే వుంటాయి" అనుకుంటూ కన్నీటితో వెనుదిరిగిన నేను ఈ కథని అస్రుతర్పణాలతో అటువంటి వారికే అంకితం చెయ్యాలనుకుంటూ కలం పట్టాను. □